క్లుప్తంగా

12న దుకాణ సముదాయాలకు వేలం

గన్నేరువరం: గన్నేరువరంలో గ్రామ పంచాయతీ ఆధీనంలో గల 17 దుకాణ సముదాయాలకు ఈనెల 12న గ్రామ పంచాయతీ ఆవరణలో ఉదయం 10 గంటలకు ఎంపీవో నర్సింహారెడ్డి అధ్యక్షతన వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10వేల డిపాజిట్ చెల్లించాలని, ఈ డబ్బులు 12వ తేదీ ఉదయం 8 నుంచి 10 గంటల్లోపు చెల్లించిన వారే అర్హులని అన్నారు. దుకాణ సముదాయాలను దక్కించుకున్నవారు నిర్వహణకు 12 జూన్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు అర్హత ఉంటుందని, మూడు రోజుల్లో మూడు నెలలకు సంబంధించిన కిరాయి డబ్బులను చెల్లించి అగ్రిమెంట్ చేసుకోవాలని కోరారు. గన్నేరువరంలో కూరగాయల వారసంత నిర్వహణకు ఏడాది కాలానికి సంబంధించి ఎంపీవో అధ్యక్షతన ఈనెల 12న ఉదయం 11.30 గంటలకు గ్రామ పంచాయతీ ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న ఉదయం 10 గంటల్లోపు ధరావత్తు రూ.5వేలు చెల్లించి పాల్గొనాలని కోరారు.

పొన్నంపై ఆరోపణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న దేశిని కోటి

జమ్మికుంట: పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదని, నిరాధారమైన ఆరోపణలు చేస్తే హుజూరాబాద్‌లో తిరగనివ్వమని జమ్మికుంట కాంగ్రెస్ నాయకుడు, ఇల్లందకుంట మాజీ చైర్మన్ దేశిని కోటి హెచ్చరించారు. శనివారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హుజూరాబాద్‌లో బూడిద లారీలను నిలిపి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ముడుపులు ముడుతున్నాయని కౌశిక్‌రెడ్డి ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు. మాజీ సర్పంచులు తిరుపతిరెడ్డి, బుర్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ముడుపులు ముడుతున్నాయని ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ ఫిషర్‌మెన్ జిల్లా చైర్మన్ బండి మల్లేశ్ అన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ యూత్ సీనియర్ నాయకుడు తిప్పారపు సంపత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ షెడ్యూల్డు కులాల సంక్షేమ బాలుర వసతి గృహంలో 2024–25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జమ్మికుంట వసతి గృహం సంక్షేమ అధికారి టి.ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ 44, ఎస్టీ 3, బీసీ 8, జనరల్ 1 ఖాళీలున్నాయని, అర్హులైన విద్యార్థులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, రెండు పాసుఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



చీమలకుంటపల్లెలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కుల పెద్దలు

గన్నేరువరం: చీమలకుంటపల్లెలో ఆరే క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీశ్రీ శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆ సంఘం పెద్దలు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత శివాజీని స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో ముందుడాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మర్దనపేట నరేశ్, శ్రీకాంత్, సంతోష్, శ్రీనివాస్, రవీందర్, శ్రీను, మాజీ ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాలకు చెందిన క్షత్రియ కుల బాంధవులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ పట్నాలు

కరీంనగర్‌రూరల్: దుర్శేడ్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి శ్రీరేణుక ఎల్లమ్మ పట్నాలు, కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం పోచమ్మ బోనాలు, 11న ఎల్లమ్మ బోనాలు, 12న నాగవెల్లి పట్నం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

మూత ‘బడి’కి పునరుజ్జీవం

- 15 ఏళ్ల క్రితం మూసివేత
- ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రత్యేక చొరవతో పునఃప్రారంభం



చొక్కారావుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

గన్నేరువరం: 2009లో ఉమ్మడి బెజ్జంకి మండలంలోని చొక్కారావుపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లేక మూతబడింది. అప్పటి నుంచి గ్రామంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తమ పిల్లలను స్తోమతను బట్టి వివిధ గ్రామాలు, ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాఠశాలను పునఃప్రారంభించడానికి గ్రామంలోని యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముస్కు కరుణాకర్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో..

విద్యార్థులకు విద్యను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, తనవంతు కృషి ఉంటుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చి ప్రత్యేక దృష్టి సారించారు. సంబంధిత పాఠశాల పునఃప్రారంభానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. విద్యాశాఖ అధికారులు ఖాసీంపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీధర్‌ను ప్రస్తుతం బడిబాట కార్యక్రమానికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. దీంతో శనివారం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామస్తులందరూ కలిసి గ్రామసభ నిర్వహించుకున్నారు. గ్రామంలోని దాదాపు 22 మంది విద్యార్థులు పాఠశాలలో చేరడానికి సుముఖంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్ ముస్కు కరుణాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు శ్రీధర్, అంగన్‌వాడీ టీచర్ శారద, గ్రామస్తులు కలిసి బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తిరిగారు. పాఠశాల పునఃప్రారంభిస్తున్నట్లు, బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. గ్రామ శాఖ సిబ్బందితో పాఠశాల గదులను శుభ్రం చేసే పనులకు శ్రీకారం చుట్టారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్నారు. 15 ఏళ్లు ఈ పాఠశాల మూతపడటంతో.. ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వన నర్సరీ ఏర్పాటు చేశారు.

12న ప్రారంభించనున్న ఎమ్మెల్యే

ఈనెల 12న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాఠశాలను పునఃప్రారంభించడానికి స్థానిక నాయకులు, అధికారులు కలిసి పాఠశాలను ముస్తాబు చేసే పని నిమగ్నమయ్యారు. పాఠశాల మూతబడి చాలా ఏళ్లు కావడంతో పాఠశాల గదులు అపరిశుభ్రంగా మారాయి. రంగులు వెలిసిపోయాయి. సంబంధిత పాఠశాలల గదులకు రంగులు వేయడానికి సిద్ధమవుతున్నారు. విద్యుత్ సౌకర్యం, బెంచీలు, ఇతర సామగ్రిని అందుబాటులోకి తీసుకురావడానికి పనులను ముమ్మరం చేస్తున్నారు.

అన్ని వసతులతో..



చొక్కారావుపల్లెలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభిస్తాం. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దీనికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా ఈ పాఠశాలలో అన్ని వసతులను అందుబాటులో తీసుకొస్తాం. ఏపీఎం లావణ్య, మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించాం. ఫర్నిచర్, స్కూల్ డ్రెస్సులు, పుస్తకాలు అందిస్తాం. గ్రామంలోని బడీడు పిల్లలు, మిగతా విద్యార్థులను తమ తల్లిదండ్రులు ఈ పాఠశాలకే పంపించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జి మండల విద్యాధికారి, గన్నేరువరం

నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే లక్ష్యం



బంక్‌ను ప్రారంభిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి, పీఏసీఎస్ సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు

జమ్మికుంట: రైతులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే జమ్మికుంట పీఏసీఎస్ లక్ష్యమని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం జగ్గయ్యపల్లి గ్రామంలో జమ్మికుంట పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆయన ప్రారంభించారు. పాడి కౌశిక్‌రెడ్డి, పొనగంటి సంపత్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సొసైటీలు రైతులకు సేవలందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. 2018లో డీజిల్ బంక్ ఏర్పాటు చేశామని, సొసైటీ డైరెక్టర్లు, సంఘం సభ్యుల సహకారంతో ఈ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు పెట్రోల్ బంక్‌ను ప్రారంభించామన్నారు. ఈ ప్రాంత రైతులకు అన్ని విధాలా సేవ చేయడంలో సొసైటీ ముందుంటుందని అన్నారు. బంక్‌లో ఏటీఎం ఏర్పాటు చేశామని, రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో రవీందర్, వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ కోఆపరేటివ్ మోటివేటర్ పొనగంటి రాజయ్య, మాజీ సీఈవో ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై సురేందర్

రామడుగు: ప్రతి ఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉంటే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని రామడుగు ఎస్సై ఎం.సురేందర్ అన్నారు. రైజింగ్ సన్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సరైన అవగాహనే సైబర్ నేరాలకు నివారణ అనే వాల్ పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన ఆవిష్కరించారు. ఆన్‌లైన్‌లో ఎవరిని గుడ్డిగా నమ్మొద్దని, మోసగాళ్ల చేతుల్లో చిక్కుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అవార్డు గ్రహీత, మండల యువజన సంఘాల సమితి అధ్యక్షుడు గజ్జెల అశోక్, యువజన సంఘాల ప్రతినిధులు శ్రీరామోజు సాయికుమార్, బండారి శ్రీకాంత్, సాగర్, రఘు, నవీన్‌కుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న మహిళలు



మట్టి తరలింపును అడ్డుకున్న కూలీలు

రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామ ఊర చెరువు నుంచి రైల్వే కంట్రాక్టర్ అక్రమంగా మట్టి తరలిస్తుండగా.. గ్రామానికి చెందిన ఉపాధిహామీ మహిళా కూలీలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మట్టి తరలింపు చేస్తున్న టిప్పర్లను శనివారం అడ్డుకున్నారు. ఊర చెరువు నుంచి మట్టి తరలింపు చేయడంతో తమ ఉపాధి కోల్పోతామని, అధికారులు తక్షణం మట్టి తరలింపు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఊరూరా బడిబాట కార్యక్రమం



మోతెలో కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



మానకొండూర్: మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

రామడుగు: మోతె గ్రామంలో శనివారం రుద్రారం జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరిగి రుద్రారం జిల్లాపరిషత్ పాఠశాల గురించి వివరించారు. పిల్లలను పంపించాలని కరపత్రాలను తల్లిదండ్రులకు అందజేశారు. నాగేందర్, శ్రీనివాస్, రవీందర్, నల్లగొండయ్య, సునీత పాల్గొన్నారు.

మానకొండూర్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా సర్వశిక్ష అభియాన్ కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని శనివారం అన్నారం ఉన్నత పాఠశాలలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాజీ సర్పంచ్ బొట్ల కిషన్, ఆంజనేయులు, ఎస్.సుదర్శన్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్‌రెడ్డి, బొద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల భాగ్యలక్ష్మి, స్వరూప, వర్దిని, సంతోష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: ఇందుర్తి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. శనివారం గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ నూతన విద్యార్థులను కలిసి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. మూడు రోజుల్లో 25 మంది నూతన విద్యార్థుల పేర్లు నమోదు చేసినట్లు జెడ్పీఎస్ఎస్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయురాళ్లు సీహెచ్ జయప్రద, ఉష తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మల్లమ్మ, ఉపాధ్యాయులు తిరుపతి, రమణాచారి, ఓదెలుకుమార్, మంజుల, పవన్‌కుమార్, మాధవి, రఘుపతిరెడ్డి, సవిత, సత్తయ్య, రమాదేవి, నిహారిక, ఇంద్రావతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామని, విద్యార్థులను అందుబాటులో ఉన్న పాఠశాలలో చేర్పించి వారి ఉన్నతికి తోడ్పడాలని రెవెళ్ళి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిరిపురం ఆనందం, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ముల్కల కుమార్ కోరారు. రెవెళ్ళి గ్రామంలో శనివారం బడిబాటలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ సునన్య, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, అరుణశ్రీ, లలిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడాలని ప్రధానోపాధ్యాయుడు డి.సుధాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లాపరిషత్ ఉన్నత బాలకల పాఠశాల ఆధ్వర్యంలో బడిబాటలో భాగంగా ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే చేసి బడిలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు సతీశ్, రమేశాచార్య, వెంకటేశ్వర్లు, సారయ్య, భాగ్యలక్ష్మి, రమాకుమారి, అవినాశ్, ఐలయ్య, సారంగపాణి, రేణుక పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని ప్రభుత్వం



మాట్లాడుతున్న పైడిపెల్లి శ్రీనివాస్

చిగురుమామిడి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తయినా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేకపోయిందని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం ఆయన చిగురుమామిడిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారంటీల్లో 18 అంశాలున్నాయని, 90 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వాటి ఊసెత్తడం లేదన్నారు. ఇప్పటివరకు వృద్ధులు, వికలాంగులకు ఆసరా పింఛన్లు ఇవ్వలేదని అన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, జిల్లా నాయకుడు ముంజ చంద్రయ్య, మండల ఉపాధ్యక్షుడు కంది శంకర్, కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, గట్టు ఎల్లయ్య, కిరణ్, మాచమల్ల బుజ్జన్న, పెండ్యాల రాజేందర్, నిమ్మ రమాకాంత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాకేశ్, వంశీ పాల్గొన్నారు.

కొండచిలువ హతం



మైలారం గ్రామస్తులు చంపిన కొండచిలువ

గన్నేరువరం: మైలారం గ్రామానికి చెందిన రవి ఇంట్లోకి చొరబడిన కొండచిలువను గ్రామస్తులు కర్రలతో హతమార్చారు. హైదరాబాద్‌లో ఉండే రవి పని నిమిత్తం ఇటీవల గ్రామానికి వచ్చాడు. శనివారం రాత్రి ఇంటి ముందు విద్యుత్ దీపం వేయకుండా బయటకు రాగా.. కాళ్లకు మెత్తగా తగలడంతో కింద చూశాడు. పామును గుర్తించి కేకలు వేశాడు. ఇంటి సమీపంలో ఉండేవారు వచ్చేలోగా కొండచిలువ ఇంట్లోని మంచాల కింద దూరింది. మంచాలను తొలగించి కొండచిలువను చంపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వెలిచాలలో పరామర్శిస్తున్న సుంకె రవిశంకర్

రామడుగు: వెలిచాల గ్రామానికి చెందిన తాళ్లపల్లి సత్తమ్మ(వికలాంగురాలు, వేములవాడ మండలం శాత్రాజుపల్లి జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. వారి కుటుంబాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. జిల్లా రైతుబంధు కమిటీ సభ్యుడు వీర్ల సంజీవరావు, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

శంకరపట్నం: ఉపాధిహామీ చట్టం అమలు, సవాళ్లపై రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను శనివారం కొత్తగట్టులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లరాజు ఆవిష్కరించారు. ఈనెల 10న నిర్వహించే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుగేందర్, మల్లయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జమ్మికుంట: శంభునిపల్లి గ్రామ సమీపంలో మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గస్తీ పోలీసులు శనివారం పట్టుకున్నారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

జమ్మికుంట: గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీకి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్ గ్రామంలో 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను గుర్తుతెలియని దొంగలు దొంగిలించారు. గుర్తించిన టీజీఎన్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ బదేల రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రవి తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుల ఎన్నిక

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులుగా వంగళ సంతోష్‌రెడ్డి, ఒంటెల అనిల్ కుమార్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన సంస్థాపన వేడుకల్లో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ క్లబ్ కౌన్సిల్ చైర్మన్ హన్మండ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ లయన్ క్లబ్ సేవల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 365 రోజులు ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పేదలకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అనాథాశ్రమం, వృద్ధాశ్రమాల్లో పండ్లు, బట్టలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింహరాజు కోదండరాం, రమణారెడ్డి, శ్రీనివాసరావు, సా మ రాజేంద్రప్రసాద్, కొండా రాంబాబు, వెంకట్, విష్ణువర్ధన్ రెడ్డి, తిరుమలేశ్, కోమల్ రెడ్డి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘ఫీజుల దోపిడీని అరికట్టడంలో వైఫల్యం’

సప్తగిరికాలనీ(కరీంనగర్).: జిల్లాలో ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీంద్ర అన్నారు. శనివారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు డీఎఫ్ఆర్‌సీ అనుమతి లేకుండానే ఫీజులను లక్షల్లో పెంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

మేయర్ అవినీతి వల్లే వినోద్‌కుమార్ ఓటమి



మాట్లాడుతున్న సోహైల్ సింగ్

విద్యానగర్(కరీంనగర్): నగర మేయర్ సునీల్‌రావు అవినీతి వల్లనే కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ఓటమి చెందారని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు సోహైల్‌సింగ్ అన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినోద్‌కుమార్ కరీంనగర్‌ను స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్పించి 1,000 కోట్లు వరకు నిధులు తీసుకొస్తే మేయర్ సునీల్‌రావు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు అవినీతికి పాల్పడటంతో వినోద్‌కుమార్ ఓడిపోయారన్నారు. మేయర్‌గా నగరంలోని 60 డివిజన్లలో ప్రచారం చేసి వినోద్‌కుమార్ గెలుపునకు పాటుపడాల్సిన సునీల్‌రావు తన సొంత డివిజన్‌కే పరిమితం అయ్యాడని తెలిపారు. సునీల్‌రావు తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 49వ డివిజన్ కార్పొరేటర్ కమల్‌జీత్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరపాలి

సప్తగిరికాలనీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న న్యాయ విద్యార్థుల పరీక్షలపై పూర్తిస్థాయి విచారణ జరపాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పా టు చేసిన సమావేశంలో మాట్లాడారు. యూనివర్సిటీ అధికారులు పరీక్షలు సరిగా నిర్వహించకపోవడం వల్ల అనేక మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

‘గుట్కా అరికట్టడంలో నిర్లక్ష్యం’

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లో గుట్కా విక్రయాలు, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలు అరికట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు గుట్కా, అంబర్, పాన్ మసాల వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారని, దీనిని అడ్డు కట్ట వేసేందుకు, ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు, యువత పెడదారి పట్టకుండా ఉండేందుకు వీటిని బ్యాన్ చేసిందని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

కొత్తపల్లి: నగరపాలక సంస్థ పరిధిలోని 11వ డివిజన్‌లో లోవోల్టేజి సమస్యను అధిగమించేందుకు మూడు 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ నర్మద నర్సన్న తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను శనివారం కాలనీవాసులు, విద్యుత్ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. రోజురోజుకు నూతన గృహాల నిర్మాణాలతో విస్తరిస్తున్న డివిజన్‌లో లోవోల్టేజి సమస్య తలెత్తకూడదనే ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువుల్లో చేపల వేట



కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మృగశిర కార్తె పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మృగశిర కార్తె రోజు తప్పనిసరిగా చేపలు తినాలనే సెంటిమెంట్ అనాదిగా వస్తోంది. శనివారం ఉదయం జూబ్లీనగర్, చెర్లభూత్కూర్, చామనపల్లి, మొగ్దుంపూర్ తదితర గ్రామాల్లోని చెరువుల్లో మత్స్యకారులు పెద్దఎత్తున చేపలు పట్టారు. స్థానికులు చెరువుల వద్దకు వెళ్లి చేపలను కొనుగోలు చేశారు. బొమ్మెలు కిలోకు రూ.400, రవ్వు కిలోకు రూ.100 చొప్పున విక్రయించారు. ప్రతీ ఇంట్లో చేపల వంటకాలతో వాసన ఘుమఘుమలాడింది. – కరీంనగర్‌రూరల్